అధికారం కోల్పోయి నైరాశ్యంలో కేటీఆర్ ఆరోపణలు

- కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కుటుంబం జైలుకే
- కూడళ్ల సుందరీకరణ పనుల్లో అవినీతిని కక్కిస్తాం
- బండి సంజయ్ కరీంనగర్‌కు చేసింది ఏమీలేదు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి నైరాశ్యంలో ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రజాపాలనపై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నాడని సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసులో విచారణకు సహకరించకుండా పారిపోయాడని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నియోజక వర్గానికి రూపాయి నిధులు తీసురాని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు రైతు భరోసాపై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొట్టుకుపోయిన మానేర్ రివర్ ఫ్రంట్, చెక్ డ్యాంల నష్టపరిహారం కాంట్రాక్టర్ చెల్లించే విధంగా నివేదిక ప్రభుత్వానికి వెళ్లిందని త్వరలో కాంట్రాక్టర్ నుంచి 2 కోట్లు రికవరీ చేస్తామని నరేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 కోట్లు ఇవ్వడం వల్లనే నిలిచిపోయిన స్మార్ట్ సిటీ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయన్నారు. మానేర్ రివర్ ఫ్రంట్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకున్నాడని తెలిపారు. మాజీ మంత్రి, అప్పటి అధికారుల అనాలోచిత విధానాలతో తీగలవంతెనపై లైట్లు వెలగడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలేసిన అంగారక టౌన్‌షిప్‌లో సుడా నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ భూమాగౌడ్, నాయకులు శ్రవణ్ నాయక్, ఆర్ష మల్లేశం, కాశెట్టి శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, గంట శ్రీనివాస్, ఆకుల నర్సయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, జీడి రమేష్, జక్కుల మల్లేశం, కొట్టె ప్రభాకర్, వాడే వెంకటరెడ్డి, మేరాజ్, ఆశ్రఫ్ పాల్గొన్నారు.

ఫటాఫట్



జీవీ రామకృష్ణారావు,
బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్ర : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా ఎకరాకు రెండువేల రూపాయలను పెంచి 12,000 ఇచ్చేందుకు నిర్ణయించింది కదా, మరి ఎందుకు ఈ ఆందోళన ?

జ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఎకరాకు ఏడాదికి 15,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రకటించి, 12,000 ఇవ్వడం రైతులను మోసం చేయడమే. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన ఆందోళన చేస్తూనే ఉంటుంది.

ప్ర : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని రైతులకు ఏడాదికి 12,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఎలా చూస్తారు ?

జవాబు: రైతులను, రైతు కూలీలను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు.. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూలీలను మభ్యపెట్టేందుకు చేసే ప్రయత్నం. భూమిలేని రైతులను ఎలా గుర్తిస్తారనేదానికి విధివిధానాలను ఖరారు చేయనివారు, 26 జనవరి నుంచే ఆర్థిక సహాయం అందిస్తారంటే ఎలా నమ్మేది.

ప్ర : రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ హామీని ప్రభుత్వం అమలు చేసింది కదా, లక్ష రూపాయల రుణమాఫీకి మీరు ఐదేళ్లు తీసుకుంటే ఏడాదిలోనే రెండు లక్షలు మాఫీ చేసింది కదా?

జవాబు: రెండు లక్షల రైతు రుణమాఫి చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం పచ్చి అబద్ధం. గ్రామాల్లోకి వస్తే రైతులే నిలదీస్తారు. రైతుభరోసా, రెండు లక్షల రుణమాఫీ, పంట నష్టపరిహారమందించడం, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, మోసాన్ని గుర్తించి రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు రైతుల అసంతృప్తి అర్థమవుతుంది.

ప్ర : మీరు చెప్పే మాటల్లో నిజం ఉంటే మీ ఆందోళనల్లో రైతులు ఎందుకు పాల్గొనడం లేదు? ఎక్కడ ఏ ఆందోళన జరిగినా మీ నాయకులు, కార్యకర్తలే ఉంటున్నారు కదా?

జవాబు: మా ఆందోళనల్లో రైతులు పాల్గొనడం లేదనేది అబద్ధం. మా పార్టీ పిలుపు మేరకు వచ్చే రైతులు, మా పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కావచ్చు కదా. వారు మా కండువాలు వేసుకుంటే రైతులు కాకుండా పోతారా.

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

జిల్లా ఓటర్లు @ 10.82 లక్షలు

- మహిళలే ఎక్కువ
- కరీంనగర్ నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు

కరీంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటర్ల తుది జాబితా విడుదలయింది. జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల పరిధిలో 10,82,751 మంది ఓటర్లుగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 5,30,337 మంది పురుషులు, 5,52,353 మంది స్త్రీలు, 61 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారు. ఈ ఓటర్లలో 614మంది సర్వీస్ ఓటర్లుకాగా, 129 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారి వివరాలతో తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

● ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
కరీంనగర్(26)	1,83,480	1,84,641	45	3,68,166
చొప్పదండి(27)	1,13,878	1,21,963	8	2,35,849
మానకొండూర్(30)	1,10,301	1,16,083	1	2,26,385
హుజూరాబాద్(31)	1,22,678	1,29,666	7	2,52,351
మొత్తం	5,30,337	5,52,353	61	10,82,751



'పురుమల్ల'కు షోకాజ్



- పార్టీ నేతలపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ సీరియస్
- వారంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశం
- ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పురుమల్ల శ్రీనివాస్‌పై బహిష్కరణ వేటు తప్పదని తెలుస్తోంది. ఇటీవల ఆయన డీసీసీ కార్యాలయంలో తన అనుచరగణంతో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా మంత్రులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డీసీసీ అధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిపై చేసిన వ్యాఖ్యలను పార్టీ సీరియస్‌గా పరిగణించింది. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి పురుమల్ల శ్రీనివాస్‌కు ఈ విషయమై షోకాజ్ నోటీసు జారీ చేశారు. వారంలోగా వివరణ ఇవ్వాలని, లేకపోతే పార్టీ నియమాలు, మార్గదర్శకాలను అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

● డీసీసీ కార్యాలయంలో సమావేశం.. వ్యాఖ్యలు

పురుమల్ల శ్రీనివాస్ డిసెంబరు 18న డీసీసీ కార్యాలయంలో తన అనుచరులతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి రాజేందర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్య తీసుకోవాలని పార్టీ నాయకులు కొందరు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేస్తూ డీసీసీ అధ్యక్షుడికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడంతోపాటు పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, డీసీసీ అధ్యక్షునిపై ఘాటైన వ్యాఖ్యలు చేయడాన్ని ప్రశ్నించారు. అదేరోజు ఏఐసీసీ ఆదేశాల మేరకు పీసీసీ అధ్యక్షుడు రాజ్‌భవన్ మార్చ్‌ను నిర్వహిస్తే దానికి హాజరుకాకుండా డీసీసీ కార్యాలయంలో పురుమల్ల శ్రీనివాస్ సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేశారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని, క్రమశిక్షణ కమిటీ పదేపదే హెచ్చరిస్తున్నా వైఖరి మార్చుకోవడం లేదని, ఇలాగే కొనసాగితే క్రమశిక్షణ కమిటీ చర్య తీసుకుంటుందని షోకాజ్‌లో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసు వచ్చిన తేదీ నుంచి వారంలోపు వివరణ ఇవ్వాలని, వివరణ ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొనడం జిల్లా కాంగ్రెస్‌లో చర్చకు దారితీసింది.

● నామినేటెడ్ పదవుల కోసం ఇన్‌చార్జి మంత్రికి లేఖ

అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు ఊహించని విధంగా పురుమల్ల శ్రీనివాస్ రంగప్రవేశం చేసి కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని పొందారు. ఆ సమయంలో ప్రస్తుత సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబు అండదండలతో కరీంనగర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకునేందుకు ప్రయత్నించారు. పురుమల్ల శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడితో ఉన్న సాన్నిహిత్యంతో ప్రయత్నం ప్రారంభించగా, ...

మిగతా 8లో

ఘనంగా గురుగోవింద్ సింగ్ మహారాజ్ జయంతి



సిక్కుల యువకుడి విన్యాసం

కరీంనగర్ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురుద్వారా ప్రబంధ్ కమిటీ ఆధ్వర్యంలో సిక్కు మతస్తుల గురుగోవింద్ సింగ్ మహారాజ్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మతగురువులు, సిక్కు మతస్తుల ప్రార్థనల అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. యాత్ర గురుద్వారా వద్ద ప్రారంభమై టవర్‌సర్కిల్, శాస్త్రీరోడ్, బోయవాడ చౌరస్తా, కమాన్ ద్వారా తిరిగి గురుద్వారా చేరుకుంది. పలు చోట్ల సిక్కుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీపీసీ అధ్యక్ష కార్యదర్శులు సర్దుల్‌సింగ్, బిషన్‌సింగ్, జగ్‌బీర్‌సింగ్‌ఖల్సా, రణబీర్‌సింగ్, సురేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

గణేశ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని, ఎన్నికల ముందు చెప్పినట్లు ఎకరానికి 15వేల రూపాయల రైతు భరోసా ఇవ్వాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ తెలంగాణచౌక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లహరిశంకర్ మాట్లాడుతూ కేసీఆర్ రైతు బంధు అని రేవంత్‌రెడ్డి రైతు రాబందు అన్నారు. రైతులకు కాంగ్రెస్ తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. మాటతప్పిన రాహుల్, రేవంత్‌తో సహా కాంగ్రెస్ నాయకులు రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, కొత్తపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

ప్రశాంతంగా దుకాణాల డ్రా

8

పది పరీక్షలపై ఫోకస్



- మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు
- 18 నుంచి ఉదయం మరో గంటపాటు స్పెషల్ క్లాస్
- వంద శాతం ఉత్తీర్ణత.. రాష్ట్రస్థాయి ర్యాంకు లక్ష్యంగా ప్రణాళిక

కరీంనగర్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. గత ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగినప్పటికీ రాష్ట్ర స్థాయిలో జిల్లా ర్యాంకు పడిపోయింది. 2022-23లో పదో తరగతి ఫలితాల్లో జిల్లా ర్యాంకు రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. 2023-24లో 1.5 శాతం అధిక ఉత్తీర్ణత సాధించినా ఏడో స్థానానికి పడిపోయింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే పాఠశాల సమయం ముగిసిన తర్వాత సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నెల 18 నుంచి ఉదయం మరో గంట ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఉదయం 8.15 నుంచి 9.15 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు క్లాసులు నిర్వహించనున్నారు.

అల్పాహారం లేకపోవడంతో విద్యార్థుల ఇబ్బంది

ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మాత్రమే అందిస్తున్నారు. గత ఏడాది వరకు ప్రత్యేక తరగతుల్లో పాల్గొనే విద్యార్థులకు స్నాక్స్ లేదా అల్పాహారం అందించేవారు. ఈసారి స్పెషల్ క్లాస్ నిర్వహిస్తున్నారే తప్ప సాయంత్రం విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వక పోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మెళకువలు చెబుతున్నారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యాశాఖ ప్రణాళిక చేపట్టింది. మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. పాఠ్యాంశాలవారీగా విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

మార్చి 21 నుంచి పరీక్షలు

మార్చి 21నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో నెల రోజుల క్రితం నుంచే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రతి రోజు సాయంత్రం నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్‌లో ఒక్కోసబ్జెక్టు టీచర్లు విద్యార్థులను గ్రూపులవారీగా విభజించి పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు. గతంలో నిర్వహించిన వార్షికపరీక్షల ఆధారంగా ప్రశ్న పత్రాలతో పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర మూల్యాంకనం చేస్తున్నారు. స్టడీ అవర్ నిర్వహిస్తున్న సమయంలో వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు

పాఠశాలలు	సంఖ్య	బాలురు	బాలికలు	మొత్తం
ప్రభుత్వ పాఠశాలలు	17	329	312	641
కేజీబీవీ	12	------	392	392
సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్	2	20	16	36
స్పోర్ట్స్ స్కూల్	1	12	15	27
టిఎస్‌డబ్ల్యు రెసిడెన్షియల్ స్కూల్స్	7	278	297	575
లోకల్ బాడీ పాఠశాలలు	124	1395	1061	2,456
ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు	2	84	64	148
అన్ ఎయిడెడ్ పాఠశాలలు	145	3,637	2,733	6,370
మోడల్ స్కూల్స్	11	442	524	966
జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్స్ స్కూల్స్	10	324	321	645
టీఎంఆర్‌ఈఐఎస్	9	201	184	385
	340	6,722	5,919	12,641

మతిస్థిమితం లేని యువకుడిని
కుటుంబ సభ్యులకు అప్పగింత

ముత్తారం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువకుడిని సపర్యలు చేసి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. సోమవారం ముత్తారంలోని ఓ వాట్సాప్ గ్రూపులో మతిస్థిమితం లేని వ్యక్తి ఫొటో, కుటుంబసభ్యుల వివరాలతో కూడిన సమాచారం వచ్చింది. మండలంలోని ఖైదం బండ గ్రామంలో ఉన్నట్టుగా ఒకరికి సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తెలియజేశారు. వెంటనే యువకుడిని కుటుంబసభ్యులు వచ్చి తీసుకెళ్లారు. తప్పిపోయిన వ్యక్తి వివరాలు అడగగా వారిది భూపాల్‌పల్లి జిల్లా పెద్దకుంటపల్లి గ్రామం అని, కొద్దిరోజుల క్రితం ప్రేమ్ సింగ్(36) తప్పిపోయాడని వారి కుటుంబ సభ్యులు రమేష్, రాజన్న తెలిపారు. మానవత్వంతో వాట్సాప్ గ్రూపులో వచ్చిన మెసేజ్‌కు తక్షణమే స్పందించిన చెల్కల యుగేందర్, ముత్తారం కానిస్టేబుల్‌లు అశోక్,రమేష్ నాయక్, ఖైదంబండ గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విష్ణు తదితరులకు యువకుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భూ తగాదాలతో ఒకరిపై దాడి

● ముగ్గురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భూమి తగాదాల విషయంలో ఒకరిపై దాడి చేసిన కేసులో ముగ్గురిపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గోవిందుపల్లికి చెందిన ఒర్సు అయిలయ్యకు సోదరులకు మధ్య ఉమ్మడి భూమి విషయంలో పాత పగలు ఉన్నాయి. ఇవి మనుసులో పెట్టుకుని మరో సోదరుడు లస్మయ్యతో పాటు మరో ఇద్దరు అయిలయ్యపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అసంపూర్తిగా హైలెవల్ వంతెనలు

● నిధులు సరిపోక నిలిచిన పనులు
● రాకపోకలకు ఇబ్బందులు
● అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



గోన్యానాయక్ తండాలో అప్రోచ్ రోడ్డు లేక అసంపూర్తిగా ఉన్న వంతెన

వీర్నపల్లి, జనవరి6 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలంలో హై లెవెల్ వంతెనల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రోజులు, నెలలు కాదు ఏకంగా సంవత్సరాలు గడుస్తున్నా పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణాలపై దృష్టి సారించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెనలు పూర్తయి అందుబాటులోకి వస్తే వాహనదారుల ప్రయాణం సురక్షితంగా సాగు తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● పూర్తికాని నిర్మాణాలు

వీర్నపల్లి మండలంలో అడవిపదిర, బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామాల పరిధిలోని హైలెవెల్ వంతెనలు నిధులు సరిపోక పూర్తికాలేదు. అడవిపదిర గ్రామంలో రూ.2 కోట్ల ఎంఆర్ఆర్ గ్రాంట్ నిధులతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశలో వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గుత్తేదారు తాత్కాలిక రోడ్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో గ్రామస్థుల సహకారంతో రైతులు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. బావ్‌సింగ్ నాయక్ తండా గ్రామ పరిధిలోని గోన్యా నాయక్ తండాలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో వంతెన పనులు చేపట్టారు. అప్రోచ్ రోడ్డు, సైడ్ వాల్ నిర్మాణాలు ఆగిపోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. వంతెన నిర్మాణాలు పూర్తయ్యేందుకు అదనపు నిధులు అవసరం ఉందని ప్రభుత్వాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. అప్రోచ్ రోడ్లకు, స్లాబ్ పనులకు అదనపు నిధులు మంజూరైతే వంతెనల పనులు పూర్తయి ప్రజల ఇబ్బందులు తొలుగుతాయి. వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పక్క గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు మారుమూల అటవీ గ్రామాలపై దృష్టి సారించాలని, అసంపూర్తి వంతెనల పనులను పూర్తి చేసి ప్రజల అవస్థలను తొలగించాలని కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న అడవిపదిర వంతెన

దాడికి పాల్పడ్డ వ్యక్తికి ఒక రోజు శిక్ష

● కోర్టు సమయంలో రోజంతా నిలబడి ఉండాలంటూ తీర్పు

జగిత్యాల క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బూతులు తిడుతూ బండ రాళ్లతో దాడి చేసిన వ్యక్తికి కోర్టు సమయంలో రోజంతా నిలబడి ఉండడంతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ జగిత్యాల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణ్ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కోనరావుపేట గ్రామానికి చెందిన అర్మూర్ గణేష్ అనే వ్యక్తి మరో 15 మందితో కలిసి 2020 సంవత్సరంలో గ్రామ శివారులో ఉన్న చెరువు కట్టమీదికి దొంగతనంగా చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ సమయంలో మెండె రమేష్ అనే వ్యక్తి వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. చెరువు కట్టమీద ఉన్న వారిని చూసి ఇంత మంది కలిసి ఎటు వెళుతున్నారని ప్రశ్నించడంతో గణేష్ అనే వ్యక్తి అకారణంగా బూతులు తిడుతూ బండ రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితుడు రమేష్ తండ్రి మెండె చిన్న భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో మద్దాయికి కోర్టు సమయంలో ఒక రోజు నిలబడి ఉండాలని శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

జ్యోతినగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను సోమవారం ఎన్టీపీసీ రింగు రోడ్డు సమీపంలో ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 225 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీపీసీ ఏరియాలో కొంతమంది యువకులు గంజాయిని సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు ఎన్టీపీసీ ఎస్ఐ టి ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో తనిఖీలు చేశారు. ఎన్టీపీసీ పీటీఎస్ రింగురోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను సోదా చేయగా వారి వద్ద గంజాయి లభించింది. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా గంజాయిని తరలిస్తున్నది ప్రగతినగర్‌కు చెందిన హ్రితిక్ బిహారీ, పీకేరామయ్యకాలనీకి చెందిన గుండ్ల రవివర్మ తేలింది. వీరిద్దరు స్థానిక ఖాజిపల్లికి చెందిన మేకల అభిలాష్ నుంచి గంజాయిని కొనగోలు చేసి తీసుకువెళ్తుండగా పోలీసులకు చిక్కారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వంతడుపులలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లంపట్ల గ్రామానికి చెందిన రామంచ మంజుల, గీత గాయపడ్డారు. ఇద్దరూ ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీకొని గాయపడ్డారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య



రమణారెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం/ఇల్లంతకుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి తడకమడ్ల రమణారెడ్డి(40) ఆత్మహత్య చేసుకున్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన రమణారెడ్డి ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు కరీంనగర్‌కు వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి బంధువు కారు తీసుకుని కరీంనగర్‌కు బయలుదేరాడు. సాయంత్రం 4:30 గంటలకు రమణారెడ్డి సమీప బంధువు శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి అప్పులు ఎక్కువయ్యాయని, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది తాను క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకుంటున్నా.. అని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశాడు. వెంటనే రమణారెడ్డి కుటుంబ సభ్యులు అతని కోసం కరీంనగర్ దారిలో వెతకగా రాత్రి 8 గంటల ప్రాంతంలో కొత్తపల్లి మండలం బద్దిపెట్టి రైతు వేదిక సమీపంలో కారులో పురుగుల మందు తాగి మృతిచెంది ఉన్నాడు. రమణారెడ్డి వల్లంపట్ల గ్రామంలో సహస్ర పెస్టిసైడ్, ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ షాపు నిర్వహిస్తున్నాడు. గ్రామంలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి కరీంనగర్‌లోని ఇద్దరు వ్యాపారులకు, సిద్ధిపేటలోని మరి కొంతమందికి విక్రయించాడని, ఆ డబ్బులు రాలేదని, రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉందని, మరో వైపున అప్పులు అధికమవటంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య అనిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి మహిళ మృతి

జ్యోతినగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి కాలనీలో మద్యం మత్తులో కిందపడి తిప్పట్ల కమల(48) అనే మహిళ మృతి చెందింది. ఎన్టీపీసీ పోలీసుల కథనం ప్రకారం.. చైతన్యపురి కాలనీకి చెందిన కమలకు చాలాకాలంగా మద్యం తాగే అలవాటుంది. కమల సమీపంలోని ఇటుకల తయారీ కేంద్రంలో పని చేస్తోంది. ఈ క్రమంలో ఆదివారం పరిశ్రమ సెలవు కావడంతో కమల ఏమీ తినకుండా ఉదయం నుంచే మద్యం తాగింది. రాత్రి 8.30 గంటల సమయంలో అకస్మాత్తుగా ఇంటి సమీపంలో కమల కిందపడిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కొడుకు సందీప్ గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కమల మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కొడుకు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తిరుపతి తెలిపారు.

స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పర్యవేక్షణ లోపంతో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒకరి మృతికి కారణమైన సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలకు చెందిన చల్ల రవి(42) అనే స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ కృష్ణ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. 21 మార్చి 2015లో సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌కు చెందిన మెరుగు శివ(23) ఈత నేర్చుకునేందుకు విద్యానగర్ స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడు. శివ తండ్రి మురళీధర్ ఫిర్యాదుతో కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. మెజిస్ట్రేట్ కేసు పూర్వ పరాలను పరిశీలించారు. చల్లరవికి ఏడాది జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారు. ఇదే విధంగా రూ. 50 వేల పరిహారం మృతుడి కుటుంబానికి చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

భవనంపై నుంచి పడి మేస్త్రి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జ్యోతినగర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవనం రెండో అంతస్థు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి కరంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన సుతారి నేతి తిరుపతి(47) మృతిచెందాడు. తిరుపతి సోమవారం ఉదయం కరీంనగర్ జ్యోతినగర్‌లోని ఒక భవనం నిర్మాణం పనులకు వచ్చాడు. రెండో అంతస్థులో గోడపై నిలబడి ప్లాస్టరింగ్ చేస్తుండగా కాలుజారి కిందపడినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతిని వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య



సిద్దార్థరెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, జనవరి, 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలో తల్లిదండ్రులు కాలేజీకి వెళ్లి చదువుకోవాలని చెప్పినందుకు మనస్తాపానికి గురైన డిగ్రీ విద్యార్థి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మారు జనార్ధన్‌రెడ్డి అనే రైతుకు కూతురు, మారు సిద్ధార్థ రెడ్డి(19)లు ఉన్నారు. కొడుకును మంచి చదువులు చదిపించాలని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేర్పించాడు. సిద్ధార్థకి చదువుపై ఆసక్తి లేక 15 రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు కాలేజీకి వెళ్లి చదువుకోవాలని పదేపదే చెబుతున్నా వాయిదాలు వేసుకుంటూ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంటిపైన ఉన్న తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పథకం ప్రకారమే పాప అపహరణ?

● అంతర్ రాష్ట్రాలకు పోలీసు బృందాలు ● సీసీ పుటేజీల ఆధారంగా అనుమానితుల చిత్రాల విడుదల

సిరిసిల్ల క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో బాలిక అపహరణ పథకం ప్రకారమే జరిగినట్లు తెలుస్తోంది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండంలోని చింతలపల్లికి చెందిన లాస్య, మధు దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె హాస్టల్‌లో ఉండి విద్యాభ్యాసం చేస్తుండగా నాలుగేళ్ల చిన్నారి అద్విత తల్లి వద్ద ఉంటోంది. తండ్రి మధు కొమురవెళ్లి దేవస్థానంలో పూజారిగా పని చేస్తున్నాడు. భార్య లాస్య మానసిక స్థితి, ఆరోగ్యం సరిగా లేదు. దీంతో ఆమె అప్పుడప్పుడు వేములవాడ దేవస్థానానికి వచ్చి నిద్రచేసి మొక్కులు చెల్లించుకుంటుంది. దేవస్థానంలో లాస్యకు ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. రాజన్న సన్నిధిలో నిద్రచేసి ధారణ చేసుకుంటే ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల సమస్యలు తొలిగిపోతాయని ఆ మహిళ లాస్యను నమ్మించింది. దీంతో డిసెంబరు 15, 2024న నాలుగేళ్ల కూతురు అద్వితతో కలిసి లాస్య రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చినట్లు బంధువుల ద్వారా బయటపడింది. ఆలయ పరిసర ప్రాంతంలో లాస్య నిద్రచేస్తున్న క్రమంలో సోదరుడు స్వామి తెలుసుకొని వేములవాడకు వచ్చి పట్టుకున్నాడు. అయితే చిన్నారి అద్విత తల్లి లాస్యతో లేకపోవడాన్ని గమనించిన సోదరుడు ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పింది. అనుమానం వచ్చిన గంగస్వామి చిన్నారి అద్విత కనిపించడంలేదని డిసెంబరు 28, 2024న వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీసీ పుటేజీల ద్వారా గుర్తింపు

లాస్యతోపాటు కూతురు అద్విత ఉన్నట్లు సీసీ పుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. వారితో పాటు మరో మహిళ ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించడంతో వెంటనే ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా మూడు బృందాల ద్వారా దర్యాప్తు ముమ్మరం చేశారు. ముగ్గురు మహిళలు చిన్నారిని అపహరించినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అపహరించిన చిన్నారితోపాటు ముగ్గురు మహిళలు వేములవాడ బస్టాండ్ నుంచి కరీంనగర్ ద్వారా వరంగల్‌కు చేరుకున్నట్లు పోలీసులు సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. మూరా సరిహద్దులు దాటి వెళ్లిందని పోలీసులు భావిస్తున్నారు.

ఐదు బృందాలతో గాలింపు చర్యలు

బాలిక అపహరణను సవాల్‌గా తీసుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్ వెంటనే ఐదు బృందాల ద్వారా 34 మంది పోలీసులతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ బృందాల్లో ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 27మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. మూడు రోజులుగా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో గాలిస్తున్నారు. రాజన్న ఆలయం పరిసరాల్లోని సెల్ టవర్‌ల ద్వారా కాల్‌డాటాను సేకరించారు. దాదాపు 41,500 పైగా ఫోన్‌కాల్స్ సెల్‌ఫోన్ టవర్‌ల ద్వారా ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో మహిళలు తిరిగిన చిత్రాలను, బాలిక చిత్రాన్ని సోషల్ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. బాలిక ఆచూకీ తెలిపినవారికి వారికి పారితోషికం ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని తాళం వేసి ఉన్న జక్కుల జ్యోతి ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు తాళం పగులగొట్టారు. అప్పటికే దుస్తులు, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. జ్యోతి ఇంటికి తాళం వేసి సంతకు వెళ్లింది. ఇంట్లోకి వచ్చే విద్యుత్ మీటరు ద్వారా కరెంటు తీగలు ఒకదానికి ఒకటి తగిలి ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు.

ప్రభుత్వ పనితీరును విమర్శనాత్మక దృష్టితో చూడొద్దు

● దశవారీగా హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలో అన్ని హామీలు అమలు చేయడం ఏ ప్రభుత్వానికి సాధ్యంకాదని, అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పనితీరును కేవలం విమర్శనాత్మక దృష్టితో చూడడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో హామీల అమలుకు ప్రణాళికను సిద్ధం చేసి, దశల వారీగా హామీలను అమలు చేస్తుందన్నారు. ఆనాడు వైయస్ఆర్ ఉచిత విద్యుత్ అమలు చేస్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 యూనిట్ల విద్యుత్, వంట గ్యాస్, ఉచిత రవాణా అమలు చేస్తుందన్నారు. బీజేపీ నాయకులు రుణమాఫీ గురించి కనీసం ఆలోచన చేయలేదన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారీగా ఐదేళ్లలో రుణమాఫీ చేయగా, రెండోసారి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.75 వేల లోపు వారికే పరిమితం చేసిందన్నారు. ఇటీవల ఏర్పడ్డ తెలంగాణ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల వరకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. ఏ విధమైన ఆంక్షలు లేకుండా ఎకరాకు రూ.12 వేల భరోసాకింద చెల్లించేందుకు క్యాబినేట్ నిర్ణయించడం హర్షణీయం అని, ప్రతిపక్షం సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర బాధ్యులు బండ శంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్‌రెడ్డి, బల్దియా ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేష్‌బాబు, ప్యాక్స్ వైస్‌చైర్మెన్ శీలం సురేందర్, సీనియర్ నాయకులు రాధాకిషన్‌రావు, గుంటి జగదీశ్వర్, పుప్పాల అశోక్, యూత్ కాంగ్రెస్ బాధ్యులు భీరం రాజేష్ తదితరులున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం : కేసు నమోదు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని హనుమాన్ నగర్‌లో ఆదివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. ఒక ఇంటి ముందు పార్కు చేసిన ఆటో, సీసీ కెమెరాను ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ ఘటనకు పాల్పడిన తాండ్ర విశ్వతేజ, గడ్డం అరుణ్‌కుమార్, పట్ల సాయితేజను సోమవారం అరెస్టు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. తాండ్ర విశ్వతేజ పుట్టిన రోజు సందర్భం గా స్నేహితులైన అరుణ్‌కుమార్, సాయితేజకు పార్టీ ఇచ్చారన్నారు. ముగ్గురు కలిసి హనుమాన్‌నగర్‌లో సీసీ కెమెరాలు, ఆటోను ధ్వంసం చేశార న్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

అక్రమంగా ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్

● అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు



మెట్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మెట్‌పల్లిటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి తనకు ఉన్న స్థలం కాక ప్రభుత్వ స్థలాన్ని కూడా తన ఖాతా కిందకి వేసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పేరు మీద ఉన్నదాని కంటే ఎక్కువగా ఆక్రమించి అనుమానం రాకుం డా భార్య పేరు మీద గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీనికి అధికారులు ఎలా సహకరించారో ఏమో కానీ అక్రమ రిజిస్ట్రేషన్ మాత్రం జరిగిపోయింది. గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం సదరు వ్యక్తికి 106 గజాల ప్లాట్ ఉన్నది. కానీ మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే సరికి ఆ స్థలం కాస్తా 229 గజాలుగా మారింది. సదరు కబ్జాదారుడు పట్టణంలోని ఓ డాక్యుమెంట్ రైటర్ సహకారంతో ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు తెరలేపాడు. సదరు డాక్యుమెంట్ రైటర్ అందినకాడికి దండుకుని ప్లాట్ వద్దకు వెళ్లి కొలతలు తీసుకోకుండానే కబ్జాదారుడి భార్య పేరు మీద అక్రమంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. గత ఏడాది అక్టోబరు 23లో డాక్యుమెంట్ నెంబర్ 3751-2024 పేరు మీద రిజిస్ట్రేషన్ చేసారు. వారం రోజుల క్రితం కబ్జాదారుడు తన ఇంటి ముందు ఉన్న రోడ్డుపై కారు, బండరాళ్లను అడ్డుపెట్టడంతో కాలనీవాసులు ప్రశ్నించారు. ఈ క్రమంలో అసలు విషయం బయటపడింది. దీనిపై కాలనీవాసులు స్థానిక గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేయగా 106 గజాలు ఉన్నట్లు వెలుగులోకి రావడంతో బాధితులు మెట్‌పల్లి సబ్ రిజిష్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారానికి సాక్షులుగా ఉన్న నలుగురు వ్యక్తులు తమకు అసలు విషయం తెలియక సాక్షులుగా సంతకం చేశామని ఆ డాక్యుమెంట్‌ను క్యాన్సల్ చేయాలని సబ్ రిజిష్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మెట్‌పల్లి సబ్ రిజిష్టర్ మహ్మద్ అనిఫోద్దిన్‌ను వివరణ కోరగా అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగింది వాస్తవమేనని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి రిజిస్ట్రేషన్ క్యాన్సల్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేస్తామన్నారు. అదే విధంగా డబ్బా కార్యదర్శి రవళిని వివరణ కోరగా సదరు వ్యక్తి గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం 106 గజాలు మాత్రమే ఉందని తెలిపింది. 5వ వార్డుకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారని దానిపై విచారణ చేపట్టిన్నట్లు తెలిపారు. అక్రమ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దాడి కేసులో ఆరు నెలల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి శ్రీనిజ కోహిర్‌కార్ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బడుగు దుబ్బరాజుకు అదే గ్రామానికి చెందిన మల్యాల దుబ్బరాజంకు మధ్య దారి విషయంలో పాత కక్షలు ఉన్నాయి. ఇదే కారణంలో దుబ్బరాజుపై కటింగ్ ప్లేర్‌తో దుబ్బరాజం దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పోగొట్టుకున్న ఉంగరం బాధితురాలికి అప్పగింత

కరీంనగర్ క్రైం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లక్ష్మీనగర్‌కు చెందిన సాన తేజశ్విత బంగారు ఉంగరం పోగొట్టుకోగా రెండో టౌన్ పోలీసులు బాధితురాలికి తిరిగి అప్పగించారు. వారం రోజుల కిందట సాన తేజశ్విత ముకరంపురలోని ఒక షాపింగ్‌మాల్‌కు వెళ్లిన సమయంలో తన చేతికి ఉన్న బంగారు ఉంగరం పడిపోగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండో టౌన్ పోలీసులు ఆ మాల్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా బంగారు ఉంగరాన్ని తీసుకున్న వ్యక్తులను గుర్తించి సోమవారం ఆ ఉంగరాన్ని యజమానురాలికి భద్రంగా అప్పగించారు. ఉంగరాన్ని తీసుకున్న వ్యక్తులను గుర్తించి, వెదికి పట్టుకున్న కానిస్టేబుల్ మల్లయ్యను రెండో టౌన్ సీఐ కె.సృజన్‌రెడ్డి అభినందించారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు గాయపడగా, రెండు వారాల పాటు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొండపాటి రాజిరెడ్డి-రాణి దంపతుల రెండో కుమారుడు రత్నాకర్‌రెడి(6) గత సంవత్సరం డిసెంబర్ 21న ఉదయం చాక్లెట్ కొనుకునేందుకు హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారి దాటుతుండగా హుజూరాబాద్ నుంచి జమ్మికుంట వైపు వస్తున్న ఓ కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని చూస్తూ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తాతయ్య ఆదిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



వినయ్‌కుమార్

వేములవాడ రూరల్, జనవరి 06(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకల మర్రికి చెందిన కట్ట వినయ్‌కుమార్ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపిక య్యాడు. చెన్నైలోని వెల్‌టెక్ యూని వర్సిటీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. వినయ్ శాతవాహన యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతూ గతేడాది జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా యువజన సంఘా ల అధ్యక్షుడు సోమినేని బాలు, చైతన్య యూత్‌క్లబ్ అధ్యక్షుడు చందనం కిషోర్, జాతీయస్థాయి చెస్ కోచ్ పాత్తూరి అనీల్ అభినందించారు.

విద్యుత్ లైన్లకు దూరంగా పతంగులు ఎగరవేయాలి

- ఎస్ఈ రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే పతంగులు ఎగరవేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ మేక రమేశ్‌బాబు అన్నారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పతంగులు ఎగురవేయొద్దని సూచిం చారు. పతంగులు, మాంజాలు విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. దారాలతో ఉన్న పతంగులే తప్ప చైనా మాంజాలతో కూడిన వాటిని వాడొద్దని సూ చించారు. మాంజాదారాలతో పక్షులతో పాటు మనుషులకు కూడా గాయాలు అయ్యే ప్రమాదం ఉందన్నారు. గాలిపటం ఎగురవేస్తూ కరెంటు తీగలకు చుట్టుకుంటే కర్ర సహాయంతో లేదా ఇనుప పైపులాంటి వాటితో తొలగించే ప్రయత్నం ఎట్టి పరిస్థితిల్లో చేయరాదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పతంగులు ఎగురవేసేటప్పు డు తప్పకుండా గమనించాలన్నారు. పిల్లల ను తెగిన, కింద పడిన విద్యుత్ వైర్లను తాకని వ్వొద్దన్నారు. ఒకవేళ విద్యుత్ వైర్లపై, విద్యుత్ పరికరాలపై పతంగులు, మాంజా లు తెగి ఉంటే వెంటనే విద్యుత్ శాఖ వారి 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు గాని లేదా సమీప విద్యుత్ కార్యాలయంలో గాని సమాచారం అందించాలని సూచించారు.

ఒకప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి ఎక్కువగా సాగు చేసేవారు. కొద్ది పత్తి, మొక్కజొన్న తదితర పంటలు పండించేవారు. ఏవైనా ప్రతికూల పరిస్థితులు ఎదురైతే పెద్ద మొత్తంలో నష్టపోయేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. రైతులు సాంప్రదాయ పంటల నుంచి వాణిజ్య పంటల వైపు మరలుతున్నారు. సీజనల్‌గా డిమాండ్ ఉన్న వాటిని పండిస్తూ లాభాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం మల్లన్న బోనాలు, సంక్రాంతి, అయ్యప్ప పూజలు జోరుగా సాగుతున్నాయి. ఈ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు బంతిపూలు సాగు చేశారు. అవి కోతకు వచ్చాయి. మార్కెట్‌లో మంచి ధర, డిమాండ్ ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బంతిపూలతో సిరుల పంట



కోనరావుపేట మండలం మంగళపల్లెలో సాగు చేస్తున్న బంతితోట

సంప్రదాయ పంటల స్థానంలో పూల సాగు

ఓదెల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఓదెల, కొలనూర్, గోపరపల్లి పొత్క పల్లి, గుంపుల, గూడెం శివారుల్లో, మడక, పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామాల్లో పలువురు రైతులు బంతిపూల తోటలను సాగు చేసు న్నారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి రావడంతో వారు సంతోషం చేస్తున్నారు. అందుబాటులో మార్కెటింగ్ సౌకర్యం ఉండ డంతో ఖర్చులు తగ్గాయని, మంచి ధర లభిస్తోందని రైతులు అంటున్నారు. 20 గుంటల భూమి ఉన్నా.. ఆ స్థలంలో ముద్ద బంతి, రిక్కబంతి తోటలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళి పండుగలకు పెద్ద ఎత్తున పూలు అమ్ముడుపోయాయి. రైతులు, ఇప్పుడు గ్రామాల్లోని ప్రతీఇంటిలో పట్నాలు, అయ్యప్ప మెట్ల పూజలు, వివాహాల డెకరేషన్లకు, శుభకార్యాల అవసరాలకు కేజీల కొద్ది పూలను విక్రయిస్తున్నారు. దీంతో ముద్దబంతి పూలకు మంచి డిమాండ్ ఉంది. కిలో ముద్దబంతి

● **తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి**

పూలు 100 నుంచి 120 రూపాయల చొప్పున అమ్ముడుపోతున్నాయి. తోటకు ఎలాంటి మందులు అవసరం లేకుండా, వాతావరణం అనుకూలిస్తే ఆశించిన దానికంటే ఎక్కువ దిగుబడి వస్తుంది. ప్రతిరోజు ఒక రైతు 10 కిలోల నుంచి 25 కిలోల అమ్ముతున్నారు.



కొలనూర్‌లో సాగు చేస్తున్న బంతితోట

● **కోనరావుపేట:** పూల సాగు లాభదాయకంగా ఉండడంతో పలువురు రైతులు ఆసక్తి చూపు తున్నారు. పండుగలు, శుభకార్యాల సీజన్లలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. కోనరావుపేట మండలం మంగళపల్లి సుమారు 150 రైతు కుటుంబాలు వ్యవసాయం తోపాటు పూల తోటలు సాగు చేస్తున్నాయి. సాధారణ పంటలతోపాటు బంతి, చామంతి, జర్మనీ, మల్లె పూల పంటలు వేస్తున్నారు. పండుగలకు, శుభకార్యాలయాల సమయంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. సీజన్‌లో బంతిపూలు కిలో 120 రూపాయల వరకు విక్రయి స్తారు. సిరిసిల్ల, వేములవాడ, కరీంనగర్ పట్టణాలకు తరలిస్తారు. సీజన్‌లో పూల తోటలపై నెలకు లక్ష రూపాయల వరకు సంపాదిస్తారు.

ఆర్థిక భారం ఉండదు

- తోకల తిరుపతిరెడ్డి, రైతు, పొత్కపల్లి



పూలతోటల సాగువల్ల నిరంతరం చేతుల్లో డబ్బులు ఉంటాయి. చిన్నచిన్న అవసరాలకు డబ్బులు అందుబాటులో ఉండి ఆర్థిక భారం మీద పడకుండా అవసరాలు తీరుతున్నాయి. ఒకే భూమిలో ఒకే రకమైన పంట వేయకుండా ఇలాంటి తోటలను సాగు చేసుకుంటే భూసారం కూడా పెరుగుతుంది. ప్రస్తుతం బంతిపూలు కిలోకు 120 రూపాయల వరకు ధర పలుకుతోంది.

పండుగల సమయంలో చేతికందేలా సాగు చేస్తాం

- సాండేసారి రవి, రైతు, మంగళపల్లి



వ్యవసాయానికి నీరున్నప్పుడు వరి, పత్తి పంటలు సాగు చేస్తాం. నీరు తక్కువ ఉన్న సమయంలో పూల తోటలు, కూరగాయల పంటలను సాగు చేస్తాం. శుభకార్యాలు, పండుగల సమయంలో ఎక్కువగా పూల తోటలు సాగు చేసి విక్రయిస్తాం.

సీజన్‌లో పూల తోటలు

- బోరుగాయ మల్లయ్య, రైతు, మంగళపల్లె



పండుగలు, శుభకార్యాలు ఉన్న సమయంలో పూల తోటలు చేస్తాం. మంగళపల్లెలో ఎర్ర బంతి, పసుపు బంతి, జర్మనీ బంతి, మల్లె తోటలు ఎక్కువగా సాగు చేస్తారు. పూల తోటలతో అధిక లాభాలు వస్తున్నాయి.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభా గాలలో సత్తా చాటారని సోమవారం మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు స్వామి తెలిపారు. హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 4, 5 తేదీలలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగంలో 12 ఈవెంట్లలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు 8 మంది క్రీడాకారులు పాల్గొన్నారు అని తెలిపారు. అందులో రెండు స్వర్ణం, మూడు రజితం, ఎనిమిది కాంస్య పతకా లు, ప్రశంసా పత్రాలు సాధించారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగ స్వామి, చింత లపల్లి మునీందర్ రెడ్డిలు తెలిపారు. పురుషుల విభాగంలో 10 కిలోమీటర్ల రన్నింగ్‌లో కే అశోక్ కాంస్య పథకం, లాంగ్ జంప్ లో జే. మహేందర్ కాంస్య పతకం, జీ. రామచంద్రం కి 100 మీటర్స్ రన్నింగ్, లాంగ్ జంప్ లో కాంస్య పతకం, 5 కీలో మీటర్ల వాకింగ్‌లో జీ. భాస్కర్ రెడ్డి కాంస్య పతకం, లాంగ్ జంప్‌లో జీ. సత్యనారాయణ రెడ్డి కాంస్య పతకం సాధించారని తెలిపారు. మహిళల విభా గంలో వీ కిలో మీటర్ల వాకింగ్‌లో ఎం. లావణ్య బంగారు పతకం, బాహేటీ బెలా 800 మీటర్స్‌లలో రజత పతకం, 5 కిలో మీటర్ వాకింగ్‌లో కాంస్య పతకం, 1500 మీటర్స్ రన్నింగ్‌లో బంగారు పతకం, ఎం లక్ష్మీ 800 మీటర్స్ రన్నింగ్‌లో రజిత పత కం, 1500 మీటర్స్ రన్నింగ్‌లో రజత పథ కం సాధించారని తెలిపారు.

వెటరన్ అథ్లెటిక్స్‌లో మూడు పతకాలు



పతకం అందుకుంటున్న మధుసూదన్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన మధుసూదన్ మూడు పతకాలను సాధించాడు. హైదరా బాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 4, 5వ తేదీల్లో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 75 సంవత్సరాల విభాగంలో తెలంగాణ రాష్ట్రం నుంచి పోటీ పడ్డ ఆయన ఐదు కిలోమీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకం, 200 మీటర్లు, 400 మీట ర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలను సాధించాడు. ఈ సందర్భంగా మధుసూ దన్‌ను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శు లు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అభినందించారు.

లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సదస్సును విజయవంతం చేయండి

గన్నేరువరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కుల కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహా కళా ప్రదర్శన విజయవంతం చేయాలని ఉమ్మ డి కరీంనగర్ జిల్లా ఎమ్మార్పీఎస్ మాదిగ కళామండలి ఇంచార్జి రామంచ భరత్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన రామ మందిరం నమూనా

కరీంనగర్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వాడి పడేసిన వస్తువు లతో గృహోపకరణాలు, రామ మందిరం తయారు చేసి ఆకట్టుకున్నారు. వాడేసిన దారపు రీళ్లు, కొబ్బరి పెంకులు, గాజులు, ప్రమిదలు, జండుబామ్ బాటిల్స్, అట్ట ముక్కలు, ఐస్‌క్రీమ్ పుల్లలు, వాడేసిన పెన్ రీఫిల్స్ వంటి వాటిని ఉపయోగించి అయోధ్య రామమందిరం తయారు చేశారు. నేషనల్ గ్రీన్ కోర్ ప్రాజెక్టులో భాగంగా పాఠశాలకు చెందిన సాత్విక, రఘు వర్దన్ అనే విద్యార్థులు వ్యర్థ వస్తువులతో రామమందిరంతో పాటు, శివలింగం, పూల సజ్జ వంటి ఇతర అలంకరణ సామగ్రిని తయారు చేశారు. విద్యార్థులను ఉపాధ్యాయలు అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను తొలగిస్తే ఊరుకోం

● **ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**



మాట్లాడుతున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సుభాష్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను తొలగించాలని చూస్తే ఊరుకోబోమని, అందరం కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగం ఊడగొడతామని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హెచ్చరించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి చేసిన వారిపై కేసులు పెట్టకపోతే భారతరత్న ఇస్తారా అంటూ కేటీఆర్ తీరుపై మండిప డ్డారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయి ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతమతమవుతున్నాడని అన్నారు. తెలంగాణలో బీజేపీ అసలే లేదని, ఇక్కడ తమ్ముడు బండి సంజయ్ ఎంపీగా ఉండి ఏమీ చేయలేకపోతున్నారని ఆరోపించారు. దేశంలో చంద్రబాబు, మోదీలకు వయస్సు అయిపోయిందని, భవిష్యత్ రాజకీయ పార్టీలన్నీ తనవైపే చూస్తున్నాయని అన్నారు. పవన్ సనాతన ధర్మం అంటూనే క్రిస్టియన్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నారని తెలిపారు. సినిమా వాళ్ల నుంచి డబ్బులు అందగానే తెలంగాణలో మళ్లీ ఎప్పటిలాగే బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు పెంచడాలు ఉంటాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు సర్పంచులుగా పోటీ చేసి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాల న్నారు. రూ.1.5 లక్షల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడితే కేసీఆర్ రూ. 7లక్షల కోట్ల అప్పు చేశాడని, ఇపుడు రేవంత్‌రెడ్డి మరో లక్షా 30 వేల కోట్లు అప్పులు చేసాడని అన్నారు. తనకో సమ్మిట్ పెట్టే అవకాశం ఇస్తే రాష్ట్రానికి కోట్లాది నిధులు తెస్తానని కేఏ పాల్ తెలిపారు.

జడ్‌ఎల్‌డీ నిర్మాణంలో తీవ్ర జాప్యం

- పది నెలలుగా ఖరారు కాని టెండర్లు
- ఆర్థిక వనరుల సాకుగా చూపే యత్నం
- జాప్యంతో పెరిగిన అంచనాలు
- పీసీబీకి ఇచ్చిన హామిని నెరవేర్చని ఆర్‌ఎఫ్‌సీఎల్

కోల్‌సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రామ గుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ (ఆర్‌ఎఫ్ సీఎల్)లో జీరో లిక్విడ్ డిశ్చార్జి(జెడ్‌ఎల్‌డీ) నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పది నెలలుగా టెండర్ల దశ దాటడం లేదు. 2024 ఫిబ్రవరి 16న రూ.160కోట్ల అంచనాలతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినా పదినెలలుగా టెండర్లు ఖరారు చేయలేకపోతున్నారు. ఒకసారి టెండర్లను రద్దు చేసి రీ టెండర్ పిలిచారు. పరిశ్రమలో అంతర్గతంగా ఏం జరుగుతుదో ఏమో కానీ ఆర్థిక వనరులను సాకుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో జెడ్ ఎల్‌డీ నిర్మాణానికి 2022లో రూ.160కోట్లతో అంచనాలు రూపొందించారు. టెండర్ల దశలో జాప్యంతో అంచనాలు పెరిగినట్టు తెలుస్తోంది. నిర్మాణం పూర్తయ్యే నాటికి రూ.210కోట్లకు పైగా చేరుకునే అవకాశం ఉంటుందని ఫెర్టి లైజర్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ జాప్యం వల్ల అంచనాలు పెరిగి సంస్థకు రూ.50కోట్ల మేర భారం పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫిబ్రవరిలో పిలిచిన టెండర్లలో ప్రభుత్వరంగ సంస్థలైన పీడీఐఎల్(ప్రాజెక్టు అండ్ డెవలప్ మెంట్ ఇండియా లిమిటెడ్), ఈఐఎల్ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు జనరల్ ఇంజనీ రింగ్(జీఈ) వంటి సంస్థలు పాల్గొన్నట్టు తెలు స్తోంది. అయినా ఈ టెండర్లను ఖరారు చేయ లేకపోతున్నారు. టెండర్లు ఖరారు అయిన తరు వాత పనులు పూర్తికావాలంటే ఏడాది సమ యం పట్టే అవకాశం ఉంది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో జెడ్‌ఎల్‌డీ నిర్మించకుండా ఉత్పత్తి ప్రారం భించడంపై వివాదాలు చెలరేగాయి.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ముఖ ద్వారం

● **ఏడాదిలో పూర్తి చేయాల్సి ఉన్నా..**

2022 మే 29న కాలుష్య నియంత్రణ మండలి ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తిని కూడా నిలిపివేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. బ్యాంకు గ్యారంటీని కూడా జప్తు చేసింది. అనంతరం ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు షరతులతో ఉత్పత్తికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ప్రకారం ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. అంటే 2023 మే నాటికే జెడ్‌ఎల్‌డీ నిర్మాణం జరపాల్సి ఉంది. 2022లో పీసీబీ ఆదేశాలతో అంచనాలు తయారు చేసినా టెండర్ల జాప్యం తో పెండింగ్ పడుతూ వస్తుంది. అంచనాలు పెరిగినప్పుడల్లా బోర్డు అను మతులు తీసు కుంటూ టెండర్ల వ్యవహారాన్ని సాగదీస్తు న్నారనే ఆరోపణలున్నాయి. జెడ్ ఎల్‌డీ నిర్మించక పోవడం వల్ల అమ్మో నియా వ్యర్థ జలాలు జనావాసాల్లోని డ్రైన్‌ల లోకి, గోదావ రిలోకి వదలడం వల్ల కాలుష్యం వెదజ ల్లుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ జెడ్‌ఎల్‌డీ టెండర్లను త్వరగా ఖరారు చేసి నిర్మాణం ప్రారంభించక పోతే భవిష్యత్‌లో మరిన్ని ఇక్క ట్లు ఎదురయ్యే పరిస్థితులు ఏర్పడను న్నాయి.



డ్రైనేజీలో కలుస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థాలు(ఫైల్)

ముక్కోటి ఏకాదశికి ధర్మపురిలో ఏర్పాట్లు



ముస్తాబైన దర్మపురి ఆలయం, స్వామి వారు



వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో జనవరి 10న జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయం పక్షాన ప్రత్యేక క్యూలైన్లు, రాజ గోపురాలకు, అన్ని దేవాలయాలకు విద్యుత్ దీపాలు, పూల దండలతో అలంకరణ చేసి, టెంట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించి భక్తుల కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే 25 వేల లడ్డు, 5 క్వింటాళ్ల పులిహోర ప్రసాదాలు అదనంగా తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. స్వామి వారల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ధర రూ 50 నిర్ణయించినట్లు ఈవో వివరించారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాట కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చారు. అయా క్యూలైన్‌ల ద్వారా ఆలయం లోకి చేరుకున్న భక్తులు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అను బంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మను దర్శించుకుని తరించారు.రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బం దులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఎస్సారార్ కళాశాలలో జాతీయ సదస్సు

గణేశ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సును నిర్వహిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సదస్సు ప్రారంభోత్స వానికి ముఖ్య అతిథిగా శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఉమేష్ కుమార్, ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య రాజశేఖర్ హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు వైస్ చైర్మన్, కామర్స్ విభాగాధిపతి టి.రాజయ్య మాట్లాడుతూ ఈ సదస్సుకు వివిధ రా ష్ట్రాల నుంచి 200 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, గోదామ్ ప్రాంతం, భగత్ నగర్, దోబీఘాట్ ప్రాంతం, జానకి వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు కాశ్మీర్‌గడ్డ, ముకరంపుర, రెండు పట్టణ ప్రాంతం ఏరియా, ఫైర్‌స్టేషన్ ప్రాంతం, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సీబీఎస్ఈ గణితశాస్త్ర ప్రమోషనల్ స్కూల్‌గా పారమిత

కరీంనగర్ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు పారమిత హెరిటేజ్ పాఠశాలను గణితశాస్త్ర ప్రమోషన్ స్కూల్‌గా ప్రకటించింది. విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గణితశాస్త్ర ప్రమోషన్‌ల స్కూల్‌గా ప్రకటిస్తూ మెరిట్ సర్టిఫికెట్‌ను అందించారని పాఠశాల హెచ్ఎం గోపికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు.

● అవీ.. ఇవీ

●సుభాష్‌నగర్: జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ పమేలాసత్పతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: కళాశాలల విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మంజూరు కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు మార్చి31 వరకు గడువు పొడిగిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు నాగలేశ్వర్ తెలిపారు.

●కరీంనగర్ అర్బన్: కోతిరాంపూర్‌లోని 32వ డివిజన్ జీపీ యంగ్ స్టార్ యూత్ క్లబ్ సభ్యులకు టీపీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ డ్రెస్‌లను ప్రదానం చేశారు.

●కరీంనగర్ టౌన్: మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా కేంద్రంలోని రావూస్ పాఠశాల విద్యార్థిని ఎస్.వైష్ణవి రోబోటిక్ ట్రైనర్ విజయేందర్ సహాయంతో రూపొందించిన బస్సు ఎస్కలేటర్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో నిదన్‌రావు, ప్రిన్సిపాల్ రెహమాన్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీరాజ్ శాఖలోని కారుణ్య నియామకాలకు మోక్షం లభించడం పట్ల టీఎన్‌జీవో ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ఈనెల 30లోగా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశిం చారు. సోమవారం ప్రజా వాణి అనంతరం వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులు, ధరణి, భూ సేకరణకు సంబంధించి దరఖా స్తులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని హాస్టళ్లను తనిఖీచేసి సౌకర్యాలు పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులు, ఎంఈవోలకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు గుర్తింపునకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేపూర్తి చేయడంపై అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపాలిటీకి సంబంధించిన 46 దరఖాస్తులతో కలిపి మొత్తం 254 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఇంచార్జి ఆర్డీవో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్న ఎస్సీ మహిళ క్యాంపస్ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

● అక్రమాలపై విచారణ జరపాలి

చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని రుక్మాపూర్ గ్రామ మాజీ వార్డు మెంబర్ మేకల రమ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఎన్టీఆర్ విగ్రహ ప్రాంగణాన్ని సుందరీకరించాలి

నగరంలో గల ఎన్టీఆర్ విగ్రహం ప్రాంగణాన్ని సుందరీకరించాలని టీడీపీ మాజీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

● కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం అధ్యక్షుడు అయిలయ్య కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందచేశారు.

● క్రిటికల్ కేర్ ఏర్పాటు చేయాలి

జిల్లా జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ విభాగాలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మపల్లి యుగేందర్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.

● ప్రభుత్వ భూములను కాపాడాలి

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ భూముల కబ్జాపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి వాటిని పరిరక్షించాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దొమ్మటి బాబు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

●కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ప్రభుత్వ సర్వే నెంబర్‌లు గల భూమి పక్కనే ఉన్న సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిని చూపి అక్రమంగా బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని కలెక్టర్‌కు గ్రామానికి చెందిన తోట కిరణ్ ఫిర్యాదు చేశారు.

ప్రశాంతంగా ముగిసిన దుకాణాల డ్రా

కరీంనగర్ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్ వెనుకాల ఉన్న వీధి వ్యాపారుల దుకాణాలకు కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన లక్కీడ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో నిర్మాణం చేసిన 120 దుకాణాలను లక్కీడ్రా నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై వ్యాపారుల ఎదుట దుకాణాలకు డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రిజర్వేషన్, జనరల్ కేటగిరి ప్రకారం 120 దుకాణాలను వ్యాపారుల ఎదుటే డ్రా తీసి షాపుల నెంబర్లు కేటాయించామని తెలిపారు. కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ద్వారా నిర్మాణం చేసిన సివిల్ హాస్పిటల్ వెనుకాల ఉన్న 120 షాపులకు లక్కీ డ్రా పూర్తయిందన్నారు. దుకాణాలు పొందిన లబ్ధిదారులు ఐదేళ్ల కాలపరిమితితో నెలకు 2 వేల రూపాయల చొప్పున సంస్థకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఆర్‌వో సునీల్, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

కరీంనగర్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ అన్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, ఎస్ఐ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్ పోటీలకు కోరా జాన్సన్ విద్యార్థి ఎంపిక

కరీంనగర్‌టౌన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు నగరంలోని కోరా జాన్సన్ పాఠశాల విద్యార్థి అక్షయ్ కుమార్ ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న పోటీల్లో పాల్గొంటాడు. విద్యార్థిని పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, సంతోష్‌రెడ్డిలు సత్కరించారు.

వాగ్దేవి, ఏంజిల్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వాసవి వనిత వాగ్దేవి, వాసవి వనిత ఏంజిల్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం నగరంలోని వైశ్యభవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. వాగ్దేవి క్లబ్ అధ్యక్షురాలిగా రూపశ్రీ, కార్యదర్శిగా రాజమణి, కోశాధికారిగా హరిణి ప్రమాణ స్వీకారం చేశారు. ఏంజిల్స్ క్లబ్ అధ్యక్షురాలిగా కాసనగొట్టు వజ్రలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల లత, కోశాధికారిగా కటకం సంధ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రెండు క్లబ్‌లకు జోన్ పర్సన్‌గా మాడిశెట్టి ఉమాదేవి బాధ్యతలు స్వీకరించారు.

'హమాలీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సుభాష్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు రోజులుగా హమాలీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకమన్నారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న, తెలంగాణ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీ యూనియన్ నాయకులు ఎం అంజయ్య, ఎ రాజయ్య, శ్రీధర్, ఎ మల్లయ్య, బాలరాజు, వెంకటేష్, సాంబమూర్తి, సంతోష్, గొర్రె కనకయ్య, గడ్డి లక్ష్మయ్య, లక్ష్మీ, మల్లయ్య, రాజమల్లు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఉచితంగా భోజనం అందించడం అభినందనీయం

సుభాష్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు వారి బంధువులకు ఉచిత అల్పాహారం, భోజనం అందించడం అభినందనీయమని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. సేవా కార్యక్రమం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పలువురికి బ్రెడ్ అందచేశారు. పేద మహిళలకు కుట్టుమిషన్లు, ప్రభుత్వ బధిరుల పాఠశాలకు సీసీ కెమెరాలు, గ్రైండర్, సౌండ్ సిస్టంను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన, బాలాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు రాచమల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

'పురుమల్ల'కు షోకాజ్ నోటీసు

(5వ పేజీ తరువాయి)

కోమటిరెడ్డిని వ్యతిరేకించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనవైపే మొగ్గు చూపించారు. దీంతో పురుమల్ల శ్రీనివాస్ అభ్యర్థిత్వం ఖరారై పోటీచేశారు. ఆ ఎన్నికల్లో పరాజయంపాలై నియోజకవర్గ ఇన్‌చార్జి అయ్యారు. ఏడాదిపాటు మంత్రి పొన్నం ప్రభాకర్ వెన్నంటి ఉంటూ అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తూ ఆయన వర్గంగానే గుర్తింపు పొందారు. నియోజకవర్గంలో పురుమల్ల శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు మరికొన్ని పదవులు తాను సూచించిన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై నేరుగా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాయడం మంత్రి పొన్నంకు ఆగ్రహం తెప్పించిందని సమాచారం. ఆ తర్వాత నుంచి పురుమల్ల శ్రీనివాస్ మంత్రులకు వ్యతిరేకంగా బాహాటంగా మాట్లాడారు. డీసీసీలోనే సమావేశం ఏర్పాటు చేసి తన అసంతృప్తిని వెలిబుచ్చడంతో పాటు మంత్రులపై, పీసీసీ, డీసీసీ అధ్యక్షులపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టార్గెట్ చేసి మాట్లాడిన కొన్ని అంశాలు పార్టీలో ఆయనను అప్రతిష్టపాలు చేసేవిగా ఉండడంతో విషయం సీరియస్‌గా మారింది. మంత్రి పొన్నం అనుచరులు ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని గడువు ఇచ్చినా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించ వద్దని పదేపదే సూచించినా మార్పు రావడం లేదని షోకాజ్‌లోనే పేర్కొనడంతో ఆయనపై ఇక వేటు తప్పదనే అభిప్రాయమే పార్టీ వర్గాల్లో బలంగా వ్యక్తమవుతున్నది. పురుమల్లపై పార్టీ బహిష్కరణ వేటు వేస్తే అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎవరవుతారన్నది ఇప్పుడు పార్టీలో చర్చగా మారింది.

సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం


హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

భగత్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ సరస్వతి శిశు మందిర్ 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నగరంలోని శ్రీపురం కాలనీలోని కోల అన్నారెడ్డి నివాసంలో నిర్వహించారు. 44 సంవత్సరాల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సరస్వతి శిశుమందిర్‌ను సందర్శించి ఉద్వేగానికి లోనయ్యారు. సమ్మేళనానికి హైకోర్టు జడ్జి ఇవి వేణుగోపాల్ హాజరై మాట్లాడుతూ చిన్ననాటి మిత్రులంతా ఒక్కచోట కలుసుకోవడం సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో కోల అన్నారెడ్డి, గౌరిశెట్టి రమేష్, బొల్ల మధు, చాడ శ్రీనివాస్, దేవళ్ల శ్రీధర్, జనగామ జగత్పాలరావు, సాగి వెంకట రమణారావు, గామినేని రామలింగం, వైద్యదయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

కోల అన్నారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

భగత్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రేకుర్తి కంటి ఆసుపత్రి కమిటీ బాధ్యులు కోల అన్నారెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు జడ్జి జస్టిస్ ఇవి వేణుగోపాల్ పరామర్శించారు. కోల అన్నారెడ్డి తనయుడు కోల ఆదిత్య మణిపాల్‌లో ఇంజనీరింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించగా నగరంలోని శ్రీపురంకాలనీలో అన్నారెడ్డి ఇంటికి వెళ్లి కోల ఆదిత్య చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో కోల లావణ్య, కోల రాంచంద్రారెడ్డి, కోల ప్రసన్నరాణి, కోల అంజనీ, రమణ, కర్నె రాజమౌళి, చిందం శ్రీనివాస్, చింతలకిషన్, బొమ్మ రాధాకృష్ణ, ముక్క శరత్‌కృష పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

సుభాష్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ రాజమల్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు అసోద రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపెల్లి పోచయ్య, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యదర్శి కవ్వంపల్లి రవి, శంకరమ్మ, పద్మ, ఎరొళ్ళ రాజయ్య, లత, ఎండి అజ్జు, బోరగాల రాజ్‌కుమార్, మల్లేశం, శ్యాంసుందర్, చంద్రయ్య, బొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడా పోటీలు

హుజూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్-2025 క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ జ్యోతి ప్రజ్వల చేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు, గోస్కుల అజయ్, రాజకుమార్, అభిలాష్, జశ్వంత్, హరీష్, అనురాగ్, విజయ్, రాంచరణ్, సంజయ్, అంజి పాల్గొన్నారు.

డివైడర్ల మధ్య చెట్లను తొలగించాలి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హుజూరాబాద్ - జమ్మికుంట ఫోర్‌లైన్ రోడ్డు డివైడర్ల మధ్య ఏపుగా పెరిగిన చెట్లను తొలగించాలని ఆర్య వైశ్య పట్టణ మాజీ అధ్యక్షుడు బచ్చు శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వాహనదారులు డివైడర్లు క్రాస్ చేస్తున్న సమయంలో చెట్లతో రోడ్డు సరిగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, మరొక వ్యక్తి మృత్యువాత పడ్డాడని ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

- డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి

గంగాధర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సంయుక్తంగా విద్యార్థులకు స్వంత ఖర్చులతో అల్పాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడటానికి తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకుని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు, విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలన్నారు. ఇష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నప్రిన్సిపాల్‌ను,అధ్యాపక బృందాన్ని అభినందించారు,

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని కరీంనగర్- వరంగల్- జమ్మికుంట ప్రధాన రహదారులపై జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కేరళ ఇంగ్లీష్ హైస్కూల్ విద్యార్థుల సహకారంతో వాహనదారులకు ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు విద్యార్థులు గులాబీ పూలు ఇస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలంటూ వినూత్న రీతిలో అవగాహన కల్పించారు. సీఐ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్, కేరళ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన

హుజూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో రోడ్డు భద్రత నిబంధనలపై ఎంవీఐ కంచి వేణు సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు, గుర్రం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం


సైదాపూర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


హైదరాబాద్‌లో పోలీసుల అదుపులో జమ్మికుంట బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని వారికి ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చడం లేదని సైదాపూర్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ప్రదీప్‌కు, వ్యవసాయ కార్యాలయంలో ఏఈవో వంశీలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, యూత్ నాయకుడు మాదం స్వామి, రజినీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు నిరసనగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా జమ్మికుంటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వారిని మాదాపూర్ పోలీస్‌లు అదుపులోకి తీసుకుని మోకిల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వదిలి పెట్టారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్లు పొనగంటి సంపత్, కొండాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సురేందర్‌రెడ్డి, శ్రీధర్, రమేష్ ఉన్నారు.

● చిగురుమామిడి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, ఎండీ సర్వర్ పాషా, అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండ

చిగురుమామిడి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రవి అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనితో పదో తరగతి వరకు చదివిన స్నేహితులు ఒక లక్ష 10 వేల 500 రూపాయాలు జమచేసి సోమవారం మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. నగదును మృతుడి కూతురు మహన్విత(4) పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ప్రశాంత్ యాదవ్, కిరణ్, హైమాత్ ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

చొప్పదండి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం చొప్పదండిలో కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 300 మందికిపైగా కార్యకర్తలకు 10 లక్షల రూపాయల ప్రమాదబీమా పత్రాలను కార్యకర్తలకు అందజేశారు. 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలో 20 లక్షల రూపాయల నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు.

లారీ డ్రైవర్లు రోడ్డు భద్రత సూత్రాలు పాటించాలి : డీటీవో


అవగాహన కల్పిస్తున్న డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి

తిమ్మాపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లు రోడ్డు భద్రత సూత్రాలు పాటించాలని డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి లారీ యజమానులు, డ్రైవర్లకు సూచించారు. కరీంనగర్ ఉప రవాణా శాఖ ఆధ్వర్యంలో డీటీసీ పెద్దింటి పురుషోత్తం ఆదేశాల మేరకు జిల్లాలోని బొమ్మకల్‌లో లారీ అసోసియేషన్‌లో లారీ యజమానులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రత మాసోత్సవాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి వాహనాలు నడిపుతున్నప్పుడు మద్యం, ధూమపానం సేవించి, మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. లారీలకు రేడియం స్టిక్కర్స్ అంటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు స్రవంతి, హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

●హుజూరాబాద్: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాల మహానాడు ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి వెళ్తున్న మాల మహానాడు నాయకులను ముందస్తుగా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కార్యక్రమంలో నాయకులు సొల్లు బాబు, స్వామి, సంపత్, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు మాదాసు మొగిలి, చిరంజీవి, దీలిప్ తదితరులు పాల్గొన్నారు.

●గన్నేరువరం: మండల మాల మహానాడు అధ్యక్షుడు అను మాండ్ల మల్లేశంను పోలీసులు ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

●హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో సోమవారం అర్చకుడు పందిళ్ల భాస్కరశర్మ సూచన మేరకు నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్‌రావు సుమారు లక్ష రూపాయల సొంత ఖర్చులతో బోర్ వేయించారు.

●శంకరపట్నం: ఎరడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సోమవారం గేటు ఏర్పాటు చేశారు.

●మానకొండూర్: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. మానకొండూర్‌లో సోమవారం లక్ష డప్పుల కళా బృందానికి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

●మానకొండూర్: కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం జరుగుతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కరాచారి ఆరోపించారు. మానకొండూర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు.

●రామడుగు: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి త్రివేదిక అన్నారు. రామడుగు మండలంలోని రామడుగు క్లస్టర్ పరిధిలోని రామడగు, దత్తోజీపేట, కోరటపల్లి గ్రామాల్లో సోమవారం రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను భూసార పరీక్షల కోసం సేకరించారు.